క్లుప్తంగా

దివాలీ విత్ మై భారత్ ర్యాలీ


యానాంలో ర్యాలీ చేస్తున్న వలంటీర్లు, అధికారులు

యానాం: మై భారత్ పోర్టల్ మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని దివాలీ విత్ మై భారత్ ర్యాలీని సోమవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐ, నెహ్రూ యువ కేంద్ర వలంటీర్లు పట్టణంలోని పలు ప్రాంతాల్లో ర్యాలీ చేశారు. దీనిలో భాగంగా ట్రాఫిక్ పోలీసులతో కలిసి స్వచ్ఛందంగా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. నో పార్కింగ్ ప్రదేశాల్లో ఉన్న వాహనాలను పార్కింగ్ ప్లేస్‌లోకి తరలించడం, హెల్మెట్‌ధారణపై అవగాహన తదితర కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో ఎస్పీ రాజశేఖరన్, ట్రాఫిక్ ఎస్సై శేరు నూకరాజు, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ కృష్ణ సుధాకర్, నెహ్రూ యువకేంద్ర కో ఆర్డినేటర్ తిర్రి గోపి తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలను సద్వినియోగం చేసుకోవాలి

తాళ్లరేవు: డ్రైనేజీలు లేని ప్రాంతాల్లో ఇంకుడు గుంతలను నిర్మించేందుకు ప్రభుత్వం రూ.6,000 మంజూరు చేస్తుందని దానిని సద్వినియోగం చేసుకోవాలని సుంకరపాలెం పంచాయతీ కార్యదర్శి జ్యోతిసుధ తెలిపారు. సోమవారం పంచాయతీ కార్యాలయంలో ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా బాబా నగర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని దళిత నాయకుడు వడ్డి ఏడుకొండలు కోరారు. నాయకులు మోపూరి వెంకటేశ్వర రావు, ఫీల్డ్ అసిస్టెంట్ ఎం.సత్యన్నారాయణ, కోరుకొండ రవి పాల్గొన్నారు.

స్వాములకు ఉచిత భిక్ష

అమలాపురం రూరల్: శ్రీ కోనసీమ మహా శాస్త అయ్యప్ప స్వామి ఆలయ సన్నిధిలో దేవతెలుకుల భక్త బృందం ఆధ్వర్యంలో సోమవారం అయ్యప్ప స్వాములకు, భవానీ మాలధారులకు ఉచిత భిక్ష కార్యక్రమం నిర్వహించారు. 10 సంవత్సరాలుగా ఈ విధంగా ఉచిత భిక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నారు. భిక్ష కార్యక్రమానికి విరాళాలు అందజేసిన దేవ తెలుకుల భక్త బృందానికి ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

కమ్యూనిటీ స్థలాన్ని ఖాళీ చేయించాలని అర్జీ

అమలాపురం రూరల్: ఆక్రమించిన కమ్యూనిటీ స్థలాన్ని ఖాళీ చేయించాలని ఉప్పలగుప్తం మండలం చిన గాడవెల్లి కాలనీ ప్రజలు జాయింట్ కలెక్టర్ టి.నిషాంతికి సోమవారం ఫిర్యాదు చేశారు. చినగాడవెల్లి కాలనీలో కాంగ్రెస్ ప్రభుత్వంలో మూడు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు ఇచ్చి, 12 సెంట్లు భూమిని కమ్యూనిటీ స్థలానికి కేటాయించారు. దాంట్లో నాలుగు సెంట్ల భూమిని దూనబోయిన ప్రభాకర్ ఆక్రమించారని అతనిపై చర్యలు తీసుకోవాలని సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపి జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ కాలనీలో ప్రభాకర్‌కు పట్టా స్థలం ఉందని ఆ స్థలాన్ని ఖాళీగా ఉంచి కమ్యూనిటీ స్థలాన్ని ఆక్రమించి పాక నిర్మించారని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. కాలనీవాసులు మాకే నాగ ఆంజనేయులు, గొలకోటి శ్రీనివాసరావు, యర్ర నాయుడు, యేరుబండి ఈశ్వరరావు, బద్రి వెంకటేశ్వరరావు, హనుమంతు మల్లేశ్వరరావు జేసీకి వినతిపత్రం అందించారు.

నేడు డ్రాఫ్ట్ ఎలక్టోరల్ జాబితా ప్రచురణ

యానాం: యానాం నియోజకవర్గానికి సంబంధించిన ఇంటిగ్రేటెడ్ డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్‌ను మంగళవారం ప్రచురించనున్నట్టు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఆర్ఏఓ మునిస్వామి సోమవారం ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 28 వరకూ అభ్యంతరాలు దాఖలు చేయవచ్చన్నారు. ఓటర్ల తుది జాబితాను జనవరి 6న విడుదల చేస్తామని చెప్పారు.

చురుగ్గా క్రీడామైదానం చదును పనులు


క్రీడాస్థలాన్ని చదును చేస్తున్న దృశ్యం

ఐ.పోలవరం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడా మైదానం చదును పనులు వేగంగా జరుగుతున్నాయి. క్రీడా మైదానంలో వాలీబాల్ కోర్టు, లాంగ్ జంప్ ఫిట్ కోర్టు, ఆట స్థలాలను జేసీబీ, పొక్లెయిన్‌తో చదును చేస్తున్నారు. పీఎంశ్రీ నిధులు పాఠశాల అభివృద్ధికి ఎంతో లాభదాయకంగా ఉన్నాయని పాఠశాల హెచ్ఎం వీధి సురేష్ బాబు తెలిపారు. పనులను ఎస్ఎంసీ చైర్మన్ బొలిశెట్టి వీర్రాజు, పిన్నమనేని శివ వర్మ, మద్దిరెడ్డి కుమార్, పంచాయతీ సెక్రటరీ గిడుగు సత్యనారాయణ, ర్యాలీ సత్య ప్రకాష్, రాయపురెడ్డిబాబి, పీడీలు పోతుల సురేష్ తదితరులు పరిశీలించారు.

విజృంభిస్తున్న విష జ్వరాలు

- రెండు నెలల్లో పల్లెలను చుట్టేసిన జ్వరాలు
- ఆలస్యంగా స్పందించిన ఆరోగ్య శాఖ
- జనానికి అవగాహన కల్పించే చర్యలు మొదలు


కోడూరుపాడులో టైరులో నిల్వ ఉన్న నీటిలో డెంగీ లార్వాను చూపిస్తూ అవగాహన పరుస్తున్న వైద్య సిబ్బంది

అల్లవరం: వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులు, పల్లెల్లో తాండవిస్తున్న అపరిశుభ్రత కారణంగా ప్రజలకు విష జ్వరాలు సోకుతున్నాయి. గడచిన రెండు నెలల కాలంలో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాలతో ప్రతి పల్లె మంచాన పడింది. ప్రతి గ్రామంలో పదుల సంఖ్యలో జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయి. జ్వరం వచ్చిందంటే చాలు శరీరంలో రక్త కణాలు సాధారణ స్థాయి కంటే మించి తగ్గిపోవడం, కీళ్ల నొప్పులు, తలనొప్పి, ఎముకలు, కండరాల్లో నొప్పి, శరీరంపై దద్దుర్లు వంటి లక్షణాలతో ప్రజలు మంచాన పడుతున్నారు. ఇంట్లో ఎవరికైనా జ్వరం సోకితే మిగిలిన వారు కూడా జ్వరం బారిన పడుతున్న సందర్భాలు కోకొల్లలుగా ఉన్నాయి. విష జ్వరాల నుంచి కోలుకోవడానికి జ్వర బాధితులు ప్రైవేటు ఆస్పత్రుల్లో రూ.వేలల్లో ఖర్చు చేయవలసి వస్తోంది.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిర్వహించే ఎలిసా టెస్టులో పాజిటివ్ వస్తేనే డెంగీగా వైద్యాధికారులు నిర్ధారిస్తున్నారు. డెంగీ సోకిన రోగులు అధిక ఉష్ణోగ్రతకు గురై.. తలనొప్పి, కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారు. వ్యాధి ప్రభావం పెరిగే కొద్దీ శరీరంలో రక్త కణాల కౌంట్ క్రమేపీ తగ్గిపోతూ శరీర అవయవాల నుంచి రక్తస్రావం జరిగి ప్రాణాలు పోతున్నాయి.

నామమాత్రంగా ఫీవర్ సర్వే

గత ప్రభుత్వంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే చేసేవారు. సర్వేలో అనుమానితుల నుంచి రక్తం శాంపిల్స్ తీసుకుని వ్యాధి నిర్ధారణ అయితే వారికి ఉచితంగా చికిత్స అందించేవారు. నెలలో రెండుసార్లు ఫీవర్ సర్వే నిర్వహించి దానికి తగినట్లుగా చికిత్స అందించి ప్రజారోగ్యాన్ని కాపాడారు. నేడు ఆ పరిస్థితి లేదు. ఫీవర్ సర్వేను నామమాత్రంగా నిర్వహిస్తున్నారు. గత ఐదేళ్లలో లేనన్ని డెంగీ కేసులు అమలాపురం నియోజకవర్గంలో ఈ ఏడాది నమోదయ్యాయి. క్షేత్ర స్థాయిలో ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు ఉన్నా ఫీవర్ సర్వే చేయించడంలో వైద్య శాఖ విఫలమవుతోంది. అల్లవరం మండలం కోడూరుపాడు గ్రామంలో నలుగురుకి డెంగీ సోకిందంటే వ్యాధి తీవ్రత ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. అమలాపురం రూరల్ పరిధిలో పేరూరు పంచాయతీలో చాలామంది డెంగీ బారిన పడ్డారు. రెడ్డిపల్లి, కామనగరువు గ్రామాల్లో ఆగస్టు నెలలో రెండేసి డెంగీ కేసులు నమోదు అయ్యాయి. వీరందరూ వివిధ ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లుగా వైద్యశాఖ అధికారులు ఇప్పుడు స్పందించారు. గ్రామాల్లో తిరుగుతూ డెంగీ పట్ల అప్రమత్తంగా ఉండాలంటూ అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తున్నారు.

ఇవి కాక ప్రైవేటు ఆస్పత్రుల్లో డెంగీ, మలేరియా, టైఫాయిడ్, సాధారణ జ్వరలైతే లెక్క లేవు. వందల్లో జ్వర పీడితులు ఉన్నారు.

రెండు నెలల్లో పీహెచ్‌సీల్లో నమోదైన కేసులివీ..

మండలం	నమోదైన డెంగీ కేసులు	మలేరియా	టైఫాయిడ్
అల్లవరం	19	లేవు	124 కేసులు
ఉప్పలగుప్తం	10	లేవు	110 కేసులు
అమలాపురం అర్బన్	15	లేవు	35 కేసులు
అమలాపురం రూరల్	05	లేవు	50 కేసులు

అవగాహన కల్పిస్తున్నాం



డెంగ్యూ పాజిటివ్ వచ్చిన ఇంటి పరిసరాల్లో ఫీవర్ సర్వే చేస్తున్నాం. ఏబేట్ మందుని స్ప్రే చేయించి లార్వాను గుడ్డు దశలో నివారించే చర్యలు చేపడుతున్నాం. పాజిటివ్ కేసుల్లో ఇండోర్ స్ప్రే చేయిస్తున్నాం. మంచినీరు నిల్వ ఉన్నా, బత్తాయి డిప్పలు, కొబ్బరి బొండాలు, టైర్లలో నిల్వ ఉన్న నీటిలో డెంగీ పెరుగుతుంది. ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలకు కొన్ని ఇళ్లను అప్పగించి శుక్రవారం డ్రై డే పాటించేలా అవగాహన కల్పిస్తున్నాం. దోమతెరలు వాడాలని సూచిస్తున్నాం. పీహెచ్‌సీల్లో రాపిడ్ టెస్టులు అందుబాటులో ఉంచుతున్నాం.

– భరతలక్ష్మి, అడిషనల్ డీఎంహెచ్ఓ, అమలాపురం

తాగునీటి సరఫరాలో ఇంత నిర్లక్ష్యమా?

- మున్సిపల్ అధికారులపై కౌన్సిలర్లు మూకుమ్మడిగా ధ్వజం
- చెరువుల అక్రమణలపై చర్యలు శూన్యమన్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, చిత్రంలో ఎమ్మెల్యే ఆనందరావు, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, కౌన్సిలర్లు

అమలాపురం టౌన్: పట్టణంలో తాగునీటి సరఫరాకు సంబంధించి పలు వార్డుల్లో అత్యవసరమై పంపిస్తున్న వాటర్ ట్యాంకర్ల మరమ్మతుల విషయంలో కూడా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు ఉండడంపై మున్సిపల్ కౌన్సిల్ పాలక, ప్రతిపక్ష కౌన్సిలర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఫలానా వార్డులో తాగునీటి సమస్య ఉందని కౌన్సిలర్లు చెబుతున్నా ఎందుకు అంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కౌన్సిలర్లు మూకుమ్మడిగా ధ్వజమెత్తారు.

మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అధ్యక్షతన స్థానిక మున్సిపల్ కార్యాలయ కౌన్సిల్ హాలులో సాధారణ సమావేశం సోమవారం జరిగింది. ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కౌన్సిలర్లు మట్టపర్తి నాగేంద్ర, సంసాని బులినాని, గొవ్వాల రాజేష్, యేడిద శ్రీను, తిక్కిరెడ్డి సత్యలక్ష్మి, అబ్బిరెడ్డి చంటి తాగునీటి ట్యాంకర్ల మరమ్మతులను పట్టించుకోని అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్డుల్లో విధులు నిర్వహిస్తున్న శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లను వేరే వార్డులకు మార్చడంపై కౌన్సిలర్లు అభ్యంతరం చెప్పారు. అవుట్ సోర్సింగ్ పద్ధతిలో 76 మందిని తీసుకోవడంపై టీడీపీ, జనసేన కౌన్సిలర్లు డిసెంట్ రాసి చైర్‌పర్సన్‌కు అందజేశారు. పాలక పక్షం ఈ అంశానికి ఆమోద ముద్ర వేసింది. మున్సిపల్ షాపుల లీజుపై చర్చించాక తగు నిర్ణయం కోసం పాలక పక్షం ఆ అంశాన్ని వాయిదా వేసింది.

చెరువుల ఆక్రమణలపై ఏం చర్యలు తీసుకున్నారు?

తాను గత కౌన్సిల్ సమావేశంలో పట్టణంలోని చెరువులు ముఖ్యంగా కంచర చెరువు ఆక్రమణలపై సర్వే చేయించి చర్యలు తీసుకోమని సూచించినా పట్టించుకోలేదు. కోర్టులో ఉన్న ఈ వ్యవహారంపై మీరు (కమిషనర్) పట్టించుకోలేదంటే మిమ్మల్ని కోర్టు ధిక్కార నేరం కింద ఎందుకు బాధ్యులను చేయకూడదని ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు ప్రశ్నించారు. దీనిపై కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు బదులిస్తూ సర్వేయర్ లేరని, తహసీల్దార్ సర్వేయర్‌ను పంపిస్తానని చెప్పారని వివరణ ఇచ్చారు. ఆయన రాగానే వార్డు సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలతో చెరువుల ఆక్రమణలపై సర్వే చేయిస్తామని స్పష్టం చేశారు. మున్సిపాలిటీలో పలు హోటల్స్‌తో పాటు, తోపుడు బండ్లపై అమ్మే ఆహారంలో కల్తీ ఉంటున్నా తనిఖీ చేసేందుకు మున్సిపాలిటీకి ఫుడ్ సేఫ్టీ అధికారి లేకపోవడం బాధాకరమని ఎమ్మెల్సీ అన్నారు. మున్సిపాలిటీకి ప్రత్యేకించి ఓ ఫుడ్ సేఫ్టీ అధికారిని నియమించాలని సూచించారు. జేసీకి కూడా తనిఖీ చేసే అధికారాలు ఉన్న దష్ట్యా ఆ స్థాయి అధికారి కూడా ఈ తనిఖీలు చేయాలని కోరారు. మున్సిపాలిటీకి సాధారణ నిధుల కొరత ఉన్న దృష్ట్యా ఈ ప్రాంతం నుంచి అన్వేషణలు, కార్యకలాపాలతో రూ.కోట్లలో లాభాలు, ఆదాయాన్ని ఆర్జిస్తున్న చమురు సంస్థల నుంచి ఏటా రూ.కోట్ల నిధులు తెచ్చే అవకాశం ఉందని ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు అన్నారు.

పట్టణంలో వంతెనలకు రూ.15 కోట్లు అవసరం

పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు నిర్మించ తలపెట్టిన ఏడు వంతెనల్లో ముఖ్యంగా మూడింటిని చేపట్టాల్సి ఉందని ఎమ్మెల్యే ఆనందరావు అన్నారు. ఈ వంతెనల నిర్మాణాలకు అవసరమైన రూ.15 కోట్లు చమురు సంస్థల నుంచి విడుదల చేయించేలా ప్రయత్నిస్తున్నామని చెప్పారు. పట్టణ మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా రోడ్ల వెడల్పు, విస్తరణ పనులు తప్పవని పేర్కొన్నారు. కనీసం రూ.100 కోట్లు ఈ పనులకు అయ్యే అవకాశం ఉందని, ఈ నిధులను చమురు సంస్థల ద్వారా రాబట్టే అంశాన్ని కలెక్టర్ మహేష్‌కుమార్‌తో చర్చించానని చెప్పారు. మున్సిపల్ డీఈఈ సీహెచ్ నాగసతీష్, రెవెన్యూ అధికారి భూపతి శ్రీలక్ష్మి తదితర అధికారులు తమ తమ విభాగాలకు సంబంధించి అంశాలు చర్చకు వచ్చినప్పుడు కౌన్సిల్‌కు వివరణ ఇచ్చారు.

స్థానికులకు ఉపాధి కల్పించాలి

అమలాపురం టౌన్: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో నిక్షేపాల అన్వేషణ కోసం ఓఎన్జీసీ నిర్వహిస్తున్న సర్వేల్లో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఓఎన్జీసీ నేషనల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రతినిధులు డిమాండ్ చేశారు. గత 30 సంవత్సరాలుగా ఓఎన్జీసీ స్థానిక నిరుద్యోగులను విస్మరించి ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను అతి తక్కువ జీతాలకు దిగుమతి చేసుకుంటోందని యూనియన్ ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ డిమాండ్‌తో అమలాపురం ఎంపీ గంటి హరీష్ మాథూర్‌ను స్థానికంగా ఉన్న ఆయన క్యాంపు కార్యాలయంలో యూనియన్ ప్రతినిధులు సోమవారం కలిసి వినతి పత్రం అందించారు. తాము వర్కర్స్ యూనియన్ ఏర్పాటు చేశామన్న నెపంతో ఓఎన్జీసీ తమకు ఉపాధి కల్పించకుండా అన్యాయం చేస్తోందని తెలిపారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు తాళ్ల బాబ్జి, కార్యదర్శి అయితాబత్తుల బాబులు, వివిధ మండలాల నాయకులు నామాడి ఆనందకుమార్, బొక్కా రమేష్, బడుగు సత్యనారాయణ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఐ.పోలవరం: మండలంలోని జి.వేమవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 16 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల హెచ్ఎం సలాది వెంకట నారాయణ సోమవారం తెలిపారు. జి.వేమవరంలో ఇటీవల ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ సాఫ్ట్ బాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు చెప్పారు. అండర్-14 విభాగంగా ఎంపికైన విద్యార్థులు చిత్తూరు జిల్లా కాణిపాకంలో నవంబర్ 16 నుంచి 18 వరకు జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు అండర్ 17 విభాగంగా ఎంపికైన క్రీడాకారులు నవంబర్ 22న అనంతపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఎంపికైన క్రీడాకారులు, వారికి శిక్షణ ఇచ్చిన పీడీ ఎ.కళావతి, పీఈటీ ఎ.నాగరామప్రసాద్‌ను గ్రామ సర్పంచ్ నల్లా సుదర్శన్‌రావు, గుత్తినదీవి సర్పంచ్ లంకలపల్లి బుల్లియ్య, కాకర్లపూడి రాజేష్, ఎంపీటీసీ చోడిశెట్టి జ్యోతి నాయుడు, పీఎంసీ చైర్మన్ బసవ అప్పారావు, చోడిశెట్టి బ్రహ్మానందం, కొండమూరి విజయబాబు, నిమ్మకాయ సత్యనారాయణ తదితరులు అభినందించారు.

వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా ఆవిర్భావ దినోత్సవం


సమావేశంలో పాల్గొన్న పార్టీ నాయకులు

అమలాపురం టౌన్: వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా ప్రథమ ఆవిర్భావ దినోత్సవం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా జరిగింది. జిల్లా పార్టీ ప్రతినిధి కొనుకు వెంకటేశ్వర రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రానున్న రోజుల్లో పార్టీ కార్మికులు, కర్షకుల హక్కులు, సంక్షేమం కోసం పోరాడుతుందని నాయకులు చెప్పారు. కొత్తపేట, అమలాపురం, పి.గన్నవరం నియోజకవర్గాల పార్టీ కన్వీనర్లు కుసుమే నరసింహారాజు, ముస్కూరి ఏసుబాబు, పితాని బేబీరావు, పార్టీ నాయకులు బండి పాండురంగ, కముజు సుందరరావు, కుడుపూడి గోపాలకృష్ణ మాట్లాడారు.

మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ పోటీల్లో ప్రతిభ



రమేష్‌కు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

యానాం: యానాం నియోజకవర్గ శివారు గ్రామం సావిత్రినగర్‌కు చెందిన సంగాడి రమేష్ మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచారు. ఏపీ బాడీ బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం విజయనగరంలో మిస్టర్ ఆంధ్రా బాడీ బిల్డింగ్ చాంపియన్‌షిప్–2024 పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో రమేష్ ప్రతిభ చూపి 5వ స్థానం సాధించాడు. ఈ పోటీల్లో వివిధ జిల్లాలకు చెందిన 28 మంది బాడీ బిల్డర్స్ పాల్గొన్నట్టు ఆయన తెలిపారు. బాడీ బిల్డింగ్ చాంపియన్ షిప్ పోటీల్లో ప్రతిభ చూపిన రమేష్‌ను గ్రామ నాయకులు అభినందించారు.

సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పథకంలో బండారులంకను చేర్చాలి

అమలాపురం రూరల్: బండారులంక గ్రామాన్ని సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ పథకంలో చేర్చి, చెత్తను అమలాపురం మున్సిపాలిటీ డంపింగ్ యార్డ్‌లో వేసుకోవడానికి అనుమతి ఇవ్వాలని ఉప సర్పంచ్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కామిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జేసీకి వినతిపత్రం అందించారు. ఎంపీటీసీ సభ్యురాలు అంకం హిమభారతి, పంచాయతీ పాలక వర్గ సభ్యులు అంకం పెదరాజు, దంగేటి మురళీ,నూక పెయ్యి శ్రీనివాసరావు, కాశిన చిట్టి రాజు, నాయకులు గుత్తుల మురుగుల రాజు సోమవారం అమలాపురం కలెక్టర్ కార్యాలయంలో జేసీ నిషాంతిని కలిసి వినతి పత్రం అందజేశారు. 17 రోజులుగా బండారులంకలో చెత్త తీసుకువెళ్లే ట్రాక్టర్లు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.

రుణాల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలి

అమలాపురం రూరల్: మండలంలోని పాలగుమ్మి గ్రామంలో స్త్రీనిధి రుణాలు దుర్వినియోగం చేసి డ్వాక్రా సంఘ సభ్యులను మోసం చేసిన ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామ సర్పంచ్ కుడుపూడి రామలక్ష్మి, ఉప సర్పంచ్ కాట్రు వసంత్‌తో పాటు పలువురు బాధితులు సోమవారం కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. డ్వాక్రా సంఘాల సభ్యులు తీసుకున్న స్త్రీ నిధి రుణాలు, వాయిదాల సొమ్మును స్వాహా చేసిన వీఓఏలపైనే కాకుండా లక్షలాది రూపాయలు దుర్వినియోగం అవుతున్నా పట్టించుకోని సీసీ, ఏపీఎంలపై కూడా చర్యలు చేపట్టాలన్నారు. బాధితులకు న్యాయం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్‌ను కోరారు.

తొలగించిన డ్రైవర్‌కు న్యాయం చేయాలి


ఓఎన్జీసీ పీఎస్ఏ సైటు వద్ద ధర్నా చేస్తున్న దళిత, ప్రజా సంఘాల ప్రతినిధులు

ఓఎన్జీసీ పీఎస్ఏ సైట్ వద్ద ప్రజా సంఘాల ధర్నా

అమలాపురం టౌన్: ఓఎన్జీసీలో అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేస్తున్న దళిత యువకుడు కె.వెంకటేశ్వర రావును అన్యాయంగా తొలగించారని ఆరోపిస్తూ అమలాపురం పట్టణం మద్దాలవారిపేటలో ఓఎన్జీసీ అధికారులు నివాసం ఉండే పీఎస్ఏ సైట్ వద్ద దళిత, ప్రజా సంఘాలు సోమవారం ధర్నా నిర్వహించాయి. ధర్నాతో నిరసన తెలిపిన దళిత, ప్రజా సంఘాల ప్రతినిధులు ఆ సైట్‌ను దిగ్బంధం చేసి నినాదాలు చేశారు. సైట్ ఎదుట ఏర్పాటుచేసిన ధర్నా శిబిరంలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ నిరసన తెలిపారు. డ్రైవర్ వెంకటేశ్వరరావును తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూనే దళిత పేటల అభివృద్ధికి ఓఎన్జీసీ సీఎస్ఆర్ నిధులు కేటాయించాలని పట్టుబట్టారు. సమస్యను స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే దష్టికి తీసుకుని వెళ్లడంతో వారు ఓఎన్జీసీ ఉన్నతాధికారులతో మాట్లాడారు. దీంతో రాజమహేంద్రవరం నుంచి ఓఎన్జీసీ అధికారులు ధర్నా శిబిరం వద్దకు వచ్చి ఆందోళనకారులతో చర్చించారు. డ్రైవర్‌ను విధుల్లోకి చేర్చుకునేందుకు అధికారులు అంగీకరించారు. డ్రైవర్‌ను విధుల్లోంచి తొలగించిన అధికారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళనకారులు ధర్నాను విరమించారు. సీఐ పి.వీరబాబు ఆధ్వర్యంలో పీఎస్ఏ సైటు వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ధర్నాకు సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరపతిరావు, కౌన్సిలర్ నాగారపు వెంకటేశ్వరరావు, దళిత ఐక్య వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఇసుకపట్ల రఘుబాబు, బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొలమూరి మోహనబాబు నాయకత్వం వహించారు.

మరుగుదొడ్ల నిర్వహణపై ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేల ఆగ్రహం

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపల్ కార్యాలయంలోని మరుగుదొడ్ల నిర్వహణ సరిగా లేక వాటి నుంచి వెదజల్లుతున్న దుర్వాసనపై ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అధికారులపై సోమ వారం ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌన్సిల్ సమావేశానికి హాజరైన వారు సమావేశం అయ్యాక కార్యాలయంలోని ఉన్న మరుగుదొడ్ల నిర్వహణ తీరును స్వయంగా వెళ్లి చూసి అసహనం వ్యక్తం చేశారు. మరుగుదొడ్ల నిర్వహణ విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కమిషనర్ రాజు, డీఈఈ సతీష్‌కు సూచించారు.

ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్ల సమావేశం

అమలాపురం రూరల్: ది అమలాపురం ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్ల, వీడియోగ్రాఫర్ల సంఘంనూతన కార్యవర్గం మొదటి సమావేశం అమలాపురం కొంకాపల్లి సత్తిమ్మ తల్లి ఆలయం వద్ద సోమవారం నిర్వహించారు. జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు గెద్దం సురేష్ కుమార్, అమలాపురం ఫొటోగ్రాఫర్ల యూనియన్ అధ్యక్షుడు చెల్లుబోయిన రమేష్ (బాబి) ఆన్‌లైన్ అటెండెన్స్‌ను ప్రారంభించారు. జిల్లా కార్యవర్గ సభ్యులను దుశ్శాలువాతో సత్కరించారు. సెక్రటరీ దొరబాబు, పీఆర్ఓ సత్యప్రసాద్, అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు కట్టమూరు కృష్ణ పాల్గొన్నారు.

సమస్యలపై గరం గరం

- కౌన్సిల్ సమావేశానికి పలు శాఖల అధికారులు గైర్హాజరు
- ఆగ్రహం వ్యక్తం చేసిన కౌన్సిలర్లు


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్

ముమ్మిడివరం: ప్రజా సమస్యలపై చర్చించే కౌన్సిల్ సమావేశానికి కొన్ని శాఖల అధికారులు హాజరు కావడం లేదు. ప్రజా సమస్యలు ఎవరికి చెప్పాలి.. సమస్యలు ఎలా పరిష్కారమవుతాయి.. ప్రజా సమస్యలపై చర్చించని సమావేశాలు ఎందుకు అంటూ పలువురు కౌన్సిలర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన కౌన్సిల్ సాధరణ సమావేశానికి చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ అధ్యక్షత వహించారు. అజెండాలోని పొందు పర్చిన పలు అంశాలపై సభ్యులు చర్చించారు. ప్రతి పక్ష టీడీపీ ఫ్లోర్ లీడర్ ములపర్తి బాలకృష్ణ మాట్లాడుతూ నగర పంచాయతీలోని పలు వార్డుల్లో డెంగీ జ్వరాలు అధికంగా ఉన్నాయన్నారు. వైద్యారోగ్య శాఖ సిబ్బంది డెంగీ జ్వరాలపై సర్వే చేయడం గాని, శాంపిల్స్ సేకరించడం గాని చేపట్టడం లేదన్నారు. డెంగీ నివారణకు సంబంధిత సిబ్బంది తీసుకున్న చర్యలు ఏమిటని ప్రశ్నించారు. దీనిపై వివరణ ఇచ్చేందుకు సంబంధిత శాఖ అధికారులు అందుబాటులో లేకపోవడంతో సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులకు కౌన్సిల్ సమావేశానికి హాజరు కావాలని సర్క్యులర్ ఇవ్వడం లేదని తెలుసుకున్న చైర్మన్ కార్యాలయ సిబ్బందిపై మండి పడ్డారు. నగర పంచాయతీ టౌన్ ప్లానింగ్ విభాగం అడ్మిన్లు, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు పనితీరు మెరుగు పర్చుకోవాలని లేకపోతే చర్యలు తప్పవని చైర్మన్ హెచ్చరించారు. నగర పంచాయతీ కార్యాలయం ఎదుట పార్కింగ్ చేసే చెత్త సేకరించే వాహనాలను తొలగించాలని గత సమావేశంలో సూచించినా ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని 17 వార్డు కౌన్సిలర్ బొంతు సత్య శ్రీనివాస్ ప్రశ్నించారు. 19వ వార్డు కౌన్సిలర్ కడలి సౌజన్య మాట్లాడుతూ నగర పంచాయతీలోని పలు ప్రాంతాల్లో అక్రమ కట్టడాలు, రేకు షెడ్డులు, భవనాలు నిర్మిస్తున్నారని, దీనిపై గతంలో అధికారులకు ఫిర్యాదు చేసినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. దీనిపై ఇంజినీరింగ్ అధికారి వివరణ ఇస్తూ అక్రమ కట్టడాల నిర్మాణం మూడు శాఖల పరిధిలో ఉన్నందున ఆయ శాఖలు సమన్వయంతో చర్యలు తీసుకోవల్సి ఉన్నందున కొంత జాప్యం జరుగుతోందన్నారు. మార్కెట్ సెంటర్ రోడ్డులో ఉన్న డంపింగ్ యార్డులో వేసే చెత్త రోడ్డుపైకి వచ్చి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని దీనిపై చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు దివి మహాలక్ష్మి, గంజా శ్రీనివాస్ కోరారు. సమావేశంలో వైస్ చైర్మన్ వేటుకూరి బోసురాజు, ఇంచార్జ్ కమిషనర్ పీవీ సుధాకర్, కౌన్సిలర్లు, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో చీరమేను విక్రయాల సందడి


యానాం మార్కెట్‌కు బకెట్లతో వచ్చిన చీరమేను


చీరమేను కొనడానికి పోటెత్తిన జనం

యానాం: పులస చేప సీజన్ ముగిశాక అరుదుగా దొరికే చీరమేను విక్రయాలతో సోమవారం యానాం మార్కెట్‌లో రద్దీ నెలకొంది. గోదావరిలో లభ్యమైన చీరమేనును బకెట్లు, క్యారేజీలతో మత్స్యకారులకు అమ్మకానికి తీసుకురావడంతో మార్కెట్ కొనుగోలుదారులతో కిటకిటలాడింది. సుమారు 100 బకెట్ల చీరమేను రావడంతో రూ.20 లక్షల వరకూ వ్యాపారం జరిగింది. ధర చౌకగా ఉండటంతో మాంసాహార ప్రియులు భారీగా మార్కెట్‌కు తరలివచ్చారు. సోమవారం తెల్లవారుజామున తూర్పుగాలులు వీయడం, వాతావరణం చల్లబడటంతో అధిక స్థాయిలో చీరమేను మత్స్యకారులకు చిక్కింది. అమ్మకాలు జోరుగా లక్షల్లో సాగాయి. చీరమేనును సోల, సేరు, తవ్వ, గ్లాసు, బకెట్ కొలతల్లో అమ్ముతుంటారు. అంగుళం సైజులో ఉండే చీరమేను చేపలను వలతో పట్టడం సాధ్యం కాదు కాబట్టి దీనిని చీరల సహాయంతో గోదావరి ముఖ ద్వారాల్లో మత్స్యకారులు పడుతుంటారు. ముఖ్యంగా శీతాకాలం ప్రారంభ సమయమైన అక్టోబర్, నవంబర్ నెలల్లో చీరమేను ఎక్కువగా దొరుకుతుందని మత్స్యకారులు తెలిపారు.

కొనసాగుతున్న ఎన్ఎంఆర్‌ల నిరసన

యానాం: యానాం పబ్లిక్‌వర్క్స్ డిపార్ట్‌మెంట్‌లో రోజువారీ వేతన ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్న తమకు వేతనాలు పెంచాలంటూ స్థానిక పీడబ్ల్యూడీ ఆఫీసు వద్ద ఎన్ఎంఆర్‌లు చేస్తున్న నిరసన సోమవారం సైతం కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారం రోజులుగా తాము నిరసనలు, ధర్నాలు చేస్తున్నా పుదుచ్చేరి ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమన్నారు. సీఎం రంగ సామి రెండేళ్ల క్రితం అసెంబ్లీలో ఎన్ఎంఆర్‌లకు రూ.18 వేలు ఇస్తామని ప్రకటించిన వాగ్దానాన్ని నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.